# ఆఖరి కానుక

అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది అమీనాకు. ఒక క్షణం వరకు తానెక్కడుందో మరచిపోయింది. ఇంకా హైదరాబాదులో డబీర్‌పురాలో తమ ఇంట్లోనే ఉందన్న భ్రమ కలిగింది. కాని, మరుక్షణంలోనే జ్ఞాపకం వచ్చింది— ఆ స్థలం వదిలి అప్పుడే ఆరు నెలలు దాటిందని, వేల మైళ్ళ దూరంలో దుబాయ్ పట్టణంలో ఒక మారుమూల ఇంట్లో ఉందని. తమ ఇల్లూ, ఇంటి వాతావరణమూ, అమ్మా నాన్నా తమ్ముళ్ళూ, తాను అనుకోకుండానే మెల్లి మెల్లిగా మరుపులోకి జారిపోతున్నారు. కాని.. కాని, ఆరోజు కలలోకూడా వూహించని సంఘటన జరిగింది. హసన్ కంట బడ్డాడు. దానితో అంతా తిరగ తోడేసింది.

హసన్ తన చిన్ననాటి స్నేహితుడు. తమ ఇంటికి నాలుగవ ఇంట్లోనే పుట్టి పెరిగాడు. అంతా కలిసే ఆడుకునే వాళ్ళు. అందరు స్నేహితుల్లోకి హసన్ అంటే ప్రత్యేకాభిమానం అమీనాకు. కాని, అమీనా యవ్వన దశలో అడుగు పెట్టగానే పరదా నిబంధన విధించబడ్డది. హసన్ కూడా పరాయి పురుషుల లెక్కలోకి వచ్చాడు. అతని ఎదుట పడటం కాని, మాట్లాడటం కాని నిషిద్ధమైంది. అయినా అమీనా హృదయ ఫలకం మీద చెరగని ముద్ర వేశాడు. దూరమవుతున్న కొద్దీ దగ్గర అవుతూ వచ్చాడు. అతి ప్రయత్నం మీదా అప్పుడప్పుడు ఇతరుల కంట పడకుండా కలుసు కునేవాడు. తమ భవిష్యత్ జీవితం గురించి ఎన్నో తియ్య తియ్యని వూహలు వూహించు

కునే వారు, వాగ్దానాలూ ప్రమాణాలూ చేసుకునేవారు. ఆ కలల ప్రపంచం లోనే జీవించేది అమీనా.

కాని, అనుకున్న దొకటి జరిగింది మరొకటి. కాదు, రెండు. మూడేళ్ళ క్రితం అటు ఎమ్. ఏ. పాసై ఉద్యోగం కోసం వెతుకులాడుతూన్న హసన్, విసిగి వేసారి ఎవరికీ ఏమీ చెప్పకుండానే ఎటో వెళ్ళి పోవటమూ, ఇటు అమీనా తండ్రి మత కలహాలకు ఆహుతి కావడమూ... దాదాపు అంతా ఒకేసారి జరిగాయి. దానితో అంతా తారుమారై పోయింది.

తండ్రి మౌల్వీ రమ్జాన్ సాహెబ్ జ్ఞాపకం రాగానే అమీనా కళ్ళు చెమ్మగిల్లాయి. దైవత్వం ఉట్టిపడే ఆకారం అతడిది. కోపం ఎరుగని అజాతశత్రువు. తమ ఇంటి సందు మలుపులోవున్న మస్జిద్‌కు పేష్ ఇమాం (మతగురువు) గా వుండేవాడు. అయిదు పూటలా నమాజు చదివించే వాడు. ఒక్కొక్కసారి 'మోజ్జన్' రాకపోతే తానే కమ్మని కంఠ స్వరంలో అజాం (మేలుకొలుపు) పాడేవాడు. పొద్దుటా సాయంత్రం ముస్లిం పిల్లలకు మస్జిద్‌లో అరబీ, ఫార్సీ, ఖురాన్ షరీఫ్ పాఠాలు చెప్పేవాడు. మస్జిద్ కమిటీవారు చాలీ చాలని నెల వారి జీతం ఇచ్చేవారు. అదనంగా మస్జిద్‌కు నమాజు చదవడానికి వచ్చే ధనవంతులు, ముఖ్యంగా శుక్రవారం రోజున, ఎంతో కొంత ముట్ట చెబుతూండేవారు. పాఠాలు చదివే కుర్రవాళ్ళ తండ్రులుకూడా కొందరు అయిదూ పదీ, ఇవ్వాలని నియమం లేకున్నా, ఇస్తూండేవారు. చుట్టుపక్కల ఇళ్ళలో ఏ శుభకార్యమైనా, తాము చేసుకున్న ప్రత్యేక వంట కాల్లో కొంత భాగం మౌల్వీ సాహెబ్ ఇంటికి కూడా పంపిస్తూండేవారు. ఇలా గడిచేది సంసారం.

మౌల్వీ సాహెబ్‌కు అమీనా ఒక్కర్తే కూతురు, చాలా కాలం వరకు ఒక్కరే సంతానంకూడాను. అదే కొడుకైతే బాగుండునని మనసులో బెంగ పడుతోనే ఉండేవారు తల్లిదండ్రులు. పదేళ్ళ తరవాత అల్లా దయతో ఇద్దరు కొడుకులు పుట్టేసరికి వాళ్ళ దిగులు కాస్తా తీరిపోయింది.

అమీనాను అల్లారు ముద్దుగా పెంచారు. ఆమె ముఖ్యంగా తండ్రికి గారాబు పట్టి. చదువు తండ్రి దగ్గరే ప్రారంభించింది. ఉర్దూ క్షుణ్ణంగా నేర్చుకుంది. కొంత అరబీ, ఫార్సీకూడా నేర్పించాడు తండ్రి. ఖురాన్ పాఠాలు వల్లె వేయించాడు. నమాజు చదవటం నేర్పించాడు. ఆ తరువాత స్కూల్లో చేర్పించాడు. తనకు ఇంగ్లీషు బొత్తిగా రాకున్నా, కూతురు పైచదువులు చదవాలని కుతూహల పడ్డాడు. చురుకుగా చదివి ఇరవయ్యోఏట బి. ఎ. పాసయింది. అప్పటికి తమ్ముళ్ళు ఇంకా పదో క్లాసు, ఆరో క్లాసులోనే ఉన్నారు. ఆ మరుసటి సంవత్సరమే జరిగింది అఘాయిత్యం.

ఎక్కడో ఆరంభమైన మత కలహాల జ్వాల దబీర్‌పురాకుకూడా ప్రాకింది. కొందరు దుండగీళ్ళు ఒక చిన్న మందిరాన్ని దోచుకున్నారట, విగ్రహాల్ని విరగ్గొట్టారట. దానికి ప్రతీకారంగా మరికొందరు దుండగీళ్ళు మస్జిద్ మీద దాడిచేశారు. అందులో అమాయకుడైన మౌల్వీ సాహెబ్‌కూడా హతమయ్యాడు. అమీనా ఇల్లు అంధకారంలో మునిగిపోయింది. తేరుకోవ టానికి చాలాకాలం పట్టింది. అమీనా ధైర్యంగా నిలబడి, ఒక వైపు తల్లి దుఃఖాన్ని ఉపశమింపి జేస్తూనే, ఎమ్. ఎ. చదివే ఉద్దేశం ఉపసంహరించు కుని, కొందరు పెద్దల సహాయంతో ఒక ముస్లిం బాలికల స్కూల్లో టీచర్‌గా కుదురుకుని, కుటుంబానికి అండగా నిలుచుంది.

ఈలోగా హసన్–తనతో అన్ని వాగ్దానాలు చేసిన హసన్, చెప్పా చెయ్యకుండా అంతర్ధానమై పోయాడు. ఎటు వెళ్ళాడో అతని ఇంటి వారికే

జాడ తెలియలేదు. అది తన తండ్రి మరణం కంటేకూడా పెద్ద దెబ్బలా తోచింది అమీనాకు. జీవితమే అంధకార బంధురమై నట్టనిపించింది. ఇక పెళ్ళి మాట తలపెట్టి కూడ దనుకుంది. అప్పుడప్పుడు అమ్మా, మామయ్యా పెళ్ళి మాట ఎత్తేవారు. తాను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే తమ్ముల చదువులు సాగే దెట్లాగో చెప్పమని అడిగేది. దానికి సరి అయిన సమాధానం దొరక్క వూరక ఉండి పోయేవాళ్ళు. మూడేళ్ళు అలాగే గడిచిపోయాయి. పెద్ద తమ్ముడు పదవ క్లాసుకూ, చిన్న తమ్ముడు తొమ్మిదవ క్లాసుకూ వచ్చారు.

ఒకనాడు, సెలవు రోజున. అమ్మ వంట చేస్తోంది. పిల్లలెటో బయటికి వెళ్ళారు. అమీనా ఏదో నవల చదువుతూ కూర్చుంది. మామయ్యా వచ్చాడు.

"అదాబ్ ! మామూజాన్ !" అమీనా సలాం చేసింది.

"జీతేరహో" బేటీ ! దగ్గరగా వచ్చి కుచ్చున్నాడు. కొంచెం ఆగి మొదలెట్టాడు, "చూడమ్మా ! నేనో ముఖ్య విషయం నీతో చెప్పటానికి వచ్చాను."

అమీనా నవ్వేసింది. మామయ్యా తెల్లబోయాడు.

"మళ్ళీ మొదలెట్టావా మామయ్యా ? నా పెళ్ళి విషయమేగా ?"

"అంత తొందరగా పడకు తల్లీ ! నేను చెప్పేది కాస్త సావధానంగా విను. నువ్వేం చిన్న పిల్లవు కావు. తుది నిర్ణయం నీ చేతుల్లోనే ఉంటుంది. నాకు కావలసిందల్లా మీ శ్రేయస్సు. నా పరిస్థితి నీకు తెలిసిందేగా ? మీ కేసహాయమూ చెయ్యలేక పోతున్నాను."

"అదేమిటి మామయ్యా ! మాకు మగ దిక్కుగా నిలుచున్నావు —అంత చాలదా ?"

"చాలదు. మీ నాన్న కన్న కలలు ఫలించాలి. అప్పుడే నాకు తృప్తి."

"ఏమిటో మామయ్యా! కథలు పొడిపిస్తున్నావు."

"కథలు కాదమ్మా ! యదార్థం చెబుతున్నాను. బావగారు తన తాహతుకు మించిన చదువే చెప్పించారు. నీ తెలివి తేటల వల్ల బి. ఏ. దాకా చదివావు. తమ్ముళ్ళని అంతకంటే పెద్ద చదువులు చదివించాలను కుంటున్నావు. పెద్దవాణ్ణి డాక్టరూ, చిన్నవాణ్ణి ఇంజనీరు చేయించాలని నీ అభిలాష. కాని నీ ఉద్యోగం సంగతీ, నీ జీతం సంగతీ నాకు తెలియంది కాదు. అదొక ప్రైవేటుస్కూలు. మూడు వందలకు సంతకం చేయించుకుని నూటయాభయ్యే నీ చేతిలో పెడతారు. అందులోనే మీ కుటుంబాన్ని ఎలా పోషించుకో గలుగుతున్నావో నీకూ, ఆ అల్లాకే తెలియాలి. మరి నీ తమ్ముళ్ళకి అంతంత పెద్ద చదువులు ఎలా చదివించగలవు ?"

"వేరే ఉద్యోగాలకి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను, మామయ్యా ! ట్యూషన్లుకూడా చెప్పాలను కుంటున్నాను,"

"అదంతా నిలకడలేని ఆదాయం.దాని భరోసా మీద నువ్వేమీ సాధించలేవు. నీకా ఇంకా పెళ్ళికాలేదు. ఇంత ప్రాయం వచ్చినా, నువ్వింకా కన్యగానే ఉండిపోవటం మీ అమ్మకూ, నాకూ ఎంత తలవంపులుగా ఉందో నీకు అర్థంకాదు. కాని, నిజంగా నువ్వు ఒప్పుకున్నా, నీకు పెళ్ళి చేసేస్థితిలో ఉన్నామా మేము ? నీకు తగిన వరుడు కావాలంటే వేలు ఖర్చవుతుంది.

ఈ హిందువుల పుణ్యమా అంటూ ఇప్పుడు మన వాళ్ళుకూడా కట్నాలు అడగటం మొదలెట్టారు. అంత డబ్బు మన దగ్గర ఎక్కడుంది ? ఎవరైనా పైసా ఖర్చు లేకుండా పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడ్డా, పెళ్ళి అయాక నిన్ను ఉద్యోగం చెయ్యనిస్తారనీ, ఆ డబ్బు మీ వాళ్ళ కివ్వనిస్తారని గానీ లేదా తానే మీ కుటుంబాన్ని పోషిస్తాడని గానీ, నీ తమ్ముళ్ళని పై చదువులు చదివిస్తాడని కానీ నమ్మకం లేదు" అని పూరుకున్నాడు.

అమీనాకు అంతా అయోమయంగా ఉంది. మామయ్య అసలు ఏమి చెప్ప దలుచుకున్నాడో అంతు పట్టలేదు. గుడ్లప్పగించి చూస్తూ కూర్చుంది.

మళ్ళీ అందుకున్నాడు మామయ్య, "హసన్ ఉండి ఉంటే...?"

అమీనా ఉలిక్కి పడ్డది. "మామయ్యా!" ఆశ్చర్యంగా అరిచింది.

"నాకుతెలుసమ్మా ! నువ్వు చెప్పనంత మాత్రాన తెలియకుండా పోదు. మీ అమ్మకు కూడా తెలుసు. కాని ఏంలాభం ? ఎటు పోయాడో ఎవరికీ తెలియదు. అతని గురించి పట్టించుకునే వాళ్ళు కూడా ఎవరున్నారని? తలిదండ్రులా లేరు. అన్నలకూ వదినెలకూ ఏం పట్టింది ? అసలు బ్రతికే ఉన్నాడో, లేడో...?"

"మామయ్యా !!"

"అవునమ్మా. బ్రతికే ఉంటే నీకైనా రాయడా ?"

"కాదు, మామయ్యా ! ఉద్యోగం దొరికి ఉండదు. ఉద్యోగం దొరక్కేగదా వెళ్ళిపోయాడు."

"లేదమ్మా, ఇన్నాళ్ళయింది. ఇంకా దొరక్కుండా ఉంటుందా!ఎక్కడో ఉండి ఉన్నా, నిన్ను పాటికి మరచిపోయే ఉంటాడు. నువ్వుకూడా అతణ్ణి మరచిపోవటమే మంచిది."

అమీనా మౌనంగా తల వంచుకుంది.

"ఇంతకూ నేను చెప్పవచ్చింది నువ్వు విననే లేదు."

ఏమిటన్నట్టు చూసింది అమీనా.

"నేను చెప్పబోయేది తొందరపడి త్రోసి పుచ్చకు. నిదానంగా ఆలోచించి, ఆ తరవాత ఒక నిర్ణయానికి రా. మీ అందరి మంచికే చెబుతూన్నాను."

కొంచెం ఆగి మళ్ళీ అన్నాడు, "ఈ మధ్య మనవాళ్ళు చాలామంది అబూదాబీ, దుబాయి, బహరేన్ లాంటి అరబ్ దేశాలకు వెళుతూన్న సంగతి నువ్వూ వినే ఉంటావు. అక్కడి వారికి చాలా డబ్బుంది. అదంతా పెట్రోల్ ద్వారా వచ్చే డబ్బుట. అక్కడి షేకులు ధనవంతులట. ఎందుకో గాని వాళ్ళకు మన దేశపు అమ్మాయిలంటే చాలా ఇష్టం. ఇక్కడికి వచ్చి పెళ్ళిళ్ళు చేసుకుని తీసుకు వెళుతూంటారు. ప్రస్తుతం అలాంటి ఒకతను షేకు అబూతాలిబ్ అని,మన వూరికి వచ్చి ఉన్నాడు.అతనికి యోగ్యురాలైన వధువు కావాలి." ఆపి అమీనా కేసి తదేకంగా చూశాడు.

అమీనాకు అర్థమై పోయింది. అయినా ఏమీ మాట్లాడలేదు.

"అతనికి నీ గురించి అంతా చెప్పాను. నిన్ను చేసుకోవటానికి ఇష్టపడుతూన్నాడు. నువ్వు 'ఊఁ'అంటే మన సమస్యలు పరిష్కారమవుతాయి. పెళ్ళి ఖర్చంతా అతనే భరిస్తాడు. ఆ తరవాత నెలకు వెయ్యి దిరంలు, అంటే మన డబ్బు రెండువేలు, మీ కుటుంబానికి పంపించటానికి సిద్ధంగా ఉన్నాడు. దానితో అమ్మా, తమ్ముళ్ళూ ఇక్కడ హాయిగా బ్రతకవచ్చు. తమ్ముళ్ళు ఎంత పై చదువులైనా చదవవచ్చు. అక్కడ నువ్వూ మహారాణిలా ఉంటావు. ఇప్పుడే నువ్వేమీ జవాబు చెప్పకు. బాగా ఆలోచించి, రేపు చెప్పినా ఫరవాలేదు... అమ్మకు నిన్ననే చెప్పేశాను. నీకు సమ్మతమైతే తనకూ అభ్యంతరం లేదని చెప్పింది. వస్తాను" లేచి వెళ్ళిపోయాడు. అమీనా ఆలోచనల్లో పడిపోయింది.

ఆ రోజుల్లా ఆలోచిస్తూనే ఉంది అమీనా. తమ్ముళ్ళువచ్చి ఏవేవో ప్రశ్నలు వేశారు. పరధ్యానంగానే సమాధానాలు చెప్పింది. అమ్మ పలకరించలేదు. దూరదూరంగానే వుంది. ఆమె మనసులోనూ అదే సమస్య మెదులుతూ ఉంటుంది. ఆమె అభిప్రాయం అడిగి లాభం లేదు. ఆమెకు ఎలాగూ సమ్మతంగానే ఉంటుంది. ఇన్నాళ్ళ కష్టాలు కడతేరుతాయంటే. ముఖ్యంగా తన కొడుకులకు ఉజ్జ్వల భవిష్యత్తు రాబోతూందంటే ఏ తల్లి కాదంటుంది? ఎటువచ్చీ తనకే జంకుగా ఉంది. ఆ అగాధంలోకి అడుగు పెట్టాలంటే భయంగా ఉంది. ఆ అరబ్ దేశాల గురించి తానూ విన్నది ఎన్నో కథలు, కొన్ని మంచివీ, కొన్ని చెడ్డవీ. తన అదృష్టం ఎలాగుందో? అమ్మ సుఖం కోసం, తమ్ముల భవిష్యత్తు కోసం తానంత మాత్రం త్యాగం చెయ్య కూడదూ? ఇప్పుడు మాత్రం తాను చేస్తూన్నది త్యాగం కాదా? అయినా ఫలితమేమీ కనిపించటం లేదు. ఇంకో అడుగు ముందుకు వేస్తే ఏం,? కాని, హసన్? హసన్ మాటేమిటి? హుఁ! తనతో మాట మాత్రంగానైనా చెప్ప కుండా మాయమైన మనిషిని నమ్ముకుని తనకూ, తన వాళ్ళకూ అన్యాయం చేసుకోవాలా?

భుజం మీద చెయ్యి పడ్డది. తిరిగి చూసుంది. అమ్మ పక్కనే కూర్చుని వుంది. ఎప్పుడు వచ్చిందో గమనించనే లేదు. "ఏమ్మా. ఏమిటాలో చిస్తున్నావు? మామయ్యా చెప్పిన విషయమేనా?"

అవునన్నట్టు తల వూపింది.

"మామయ్యా నీతో చెప్పిందంతా విన్నాను. మామయ్యా ఒకటి రెండు విషయాలు నీతో చెప్పటం మరిచిపోయినట్టున్నాడు. అవి కూడా నువ్వు తెలుసుకోవటం మంచిది. అతనికి ఆట్టే ఎక్కువ ప్రాయం ఉండదట. నల భై లోపే ఉంటుందట. మొదటి భార్య ఆదేశస్థురాలే. అబూదాబీలో ఉంటుందట. ఇప్పుడు చేసుకోబోయే రెండవ భార్యను దుబాయిలో మరో ఇంట్లో ఉంచు

తాట్ట. మన మతంలో ఇది తప్పు కాదుగా? మన బంధువుల్లోనే ఇద్దరు భార్య లున్నవాళ్ళు లేరూ? ఇంకా నయం. ఇద్దర్నీ ఒకేచోట ఉంచడు. తీరా అక్కడికి వెళ్ళాక విడాకు లిచ్చేస్తే ఎలాగని అడిగాను. 'మెహర్' (భరణం) గా ఇరవై అయిదువేల దిరంలు లేక ఏభైవేల రూపాయలు బాంకులో పెడతాట్ట." అమ్మ ఆగింది.

అంటే, తాను ఏభై వేలకు అమ్ముడు పోతూందన్న మాట. తాను అను కున్నట్టే అమ్మకు ఉబలాటంగానే ఉంది.

"మరి మీకు నెలకు రెండువేలు పంపించే మాటేమిటి?" మొట్ట మొదటి సారిగా ప్రశ్న వేసింది అమీనా.

"అదీ నెలనెలా అందేటట్లు ఇక్కడ బాంకు ద్వారానే ఏర్పాటు చేస్తాట్ట."

"ఎన్నాళ్ళని?"

"అది నీ చేతుల్లో ఉంది."

"అంటే?"

"నువ్వు ఎన్నాళ్ళు ఆయనకు భార్యగా ఉంటే అన్నాళ్ళూ మాకా డబ్బు లభిస్తూనే ఉంటుందట."

ఒహో! అన్ని ఏర్పాట్లూ కట్టుదిట్టంగానే జరిగాయన్న మాట. ఇక తాను కాదనటానికి తావేది?

"ఏమమ్మా, ఏమంటావు? నీకు సమ్మతమైతేనే. బలవంతం లేదు," అమ్మ భయం భయంగా కూతురు కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

అమీనా ఒకసారి తల్లిని తేరిపారచూసి, తల వంచుకుని, "మీ ఇష్టం. మీ ఇష్టప్రకారమే కానివ్వండి" అన్నది.

అమ్మ మొహం విప్పారింది. వెంటనే లేచి కొయ్యకు తగిలించిఉన్న నల్ల బురఖా తీసి వేసుకుని, గబగబా బయటికి నడిచింది. మామయ్యా ఇంటికేనని తెలుసు. అమీనా నిట్టూర్పుమాత్రం విడిచింది.

ఆ తరవాత పనులన్నీ చురుకుగా జరిగాయి. తనను ముందు ఒకసారి చూడాలని పట్టుపట్టాడు షేఖ్. ఇంటికి రప్పిస్తే అందరికీ తెలిసిపోతుందని రెండవరోజు అమీనా, తల్లి బురఖాలు వేసుకుని మామయ్యా ఇంటికి వెళ్ళారు. కాస్సేపటికి షేఖ్ అక్కడికి టాక్సీలో వచ్చాడు. ఒకరి నొకరు చూసుకున్నారు. అతను ఆజానుబాహువు. తెల్లని మొహంమీద నల్లని గడ్డం, మీసాలు అందంగా కనిపించాయి. అరబ్బుల డ్రెస్సులో లేడు—సూటు వేసుకున్నాడు. అమీనాను ఒక మాటు నఖశిఖపర్యంతం పరికించి చూసి, సంతృప్తిగా నవ్వి, అరబీలో ఏదో అన్నాడు. తనకు అర్థం కాలేదు. జవాబు చెప్పకుండా తల దించేసుకుంది. లోపలికి వచ్చేసింది. అతను టీ తాగి మామయ్యను బయటకు తీసుకెళ్ళి, ఏదో మాట్లాడి వెళ్ళిపోయాడు.

మరో నాలుగు రోజులకే ముహూర్తం నిశ్చయమైంది. మామయ్యా ద్వారా అయిదు వేల రూపాయలు పంపించాడు షేఖ్. అమ్మ ఆనందానికి అంతులేదు. అంత డబ్బు ఆమె ఎన్నడూ చూసి ఎరుగదు. పెళ్ళి ఘనంగా జరిపిద్దామంది. కాని, తానూ, మామయ్యా అడ్డు పడ్డారు.

పెళ్ళి అతి నిరాడంబరంగా జరిగింది. ఇరుగు పొరుగు వారిలోనూ, బంధువుల్లోనూ బహు కొద్ది మందిని మాత్రం పిలిచారు. బాజాభజంత్రీ, బారత్ ఏమీలేవు. సరిగ్గా సాయంత్రం ఆఇంటికి పెళ్ళికొడుకు షేఖ్ అబూ తాలిబ్-అరబ్బు డ్రస్సు 'ఖిబా'లో ఇద్దరు పరిచయస్థులను వెంటబెట్టుకుని టాక్సీలో వచ్చాడు. మరి కొంచెంసేపటికి ఖాజీ (మతగురువు) వచ్చాడు. అందరూ కలసి నమాజు చేశారు. ఆ తరువాత, పెళ్ళి ఒడంబడిక పత్రం తయారు చేయబడ్డది.అందులో షేఖ్ ఇచ్చినమాట ప్రకారం మెహర్ ఇరవై అయిదువేల 'దిరం'లు లేక ఏభై వేల రూపాయలు వ్రాశారు. వధూవరుల

అంగీకారం పొందిన తరువాత, ఇద్దరు గవాయిలు (సాక్షులు) ఆ పత్రం మీద సంతకాలు చేశారు. ఖాజీ, ఖురాన్ లోంచి కొన్ని శ్లోకాలు చదవటంతో నికాహ్ తతంగం పూర్తి అయింది. జల్వా (వధూవరులు అద్దంలో ఒకరి నొకరు చూసు కోవటం) ఎగరకొట్టేశారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. రాత్రి పదిగంటలప్పుడు రుక్సతీ (వీడుకోలు) జరిగింది. అమీనా తల్లినీ, తమ్ముళ్లనీ కావలించుకుని ఏడ్చిఏడ్చి, వెళ్ళి టాక్సీలో కూర్చుంది.

షేఖ్‌తో వచ్చిన ఇద్దరూ దారిలో దిగిపోయారు. టాక్సీ తిన్నగా ఉస్మాన్‌సాగర్‌కు వెళ్ళింది. ఆ పక్కనే కొత్తగా కట్టిన టూరిస్టు కాటేజీల్లో ఒకదానిలో దిగారు. పైకి గుడిసెలా కనిపించే కాటేజీలో అన్ని ఆధునిక సౌకర్యాలూ ఉన్నాయి. అలాంటి కాటేజీలు ఉంటాయని కూడా తెలియదు అమీనాకు.

బట్టలుమార్చుకోగానే ఒకకొత్త విస్కీ బాటిల్ తీసి కూర్చున్నాడు షేఖ్. అమీనా చకితురాలైంది. వాళ్ళ దేశంలో, ఇస్లాం మతానుసారం తాగుడు పూర్తిగా నిషిద్ధమని విన్నది. మరి ఈ అలవాటెలా అయిందో అర్థంకాలేదు. అదే అడుగుదా మనుకుంది. కాని, ధైర్యం లేక అడగలేక పోయింది.

రెండు మూడు పెగ్గులు వేసుకున్న తరువాత, షేఖ్ మంచంమీద కొచ్చి అమీనా పక్కన కూర్చున్నాడు. రెండు చేతులతో అమీనా మొహం పైకెత్తి పెదిమల్ని గట్టిగా ముద్దెట్టుకున్నాడు. సారాయి వాసన భరించలేక మొహం చిట్లించింది అమీనా. కాని అదేమీ గమనించేస్థితిలో లేడు షేఖ్. అమీనా ఒంటిమీద పలువలు ఒక్కొక్కటే ఒలవటం మొదలుపెట్టాడు...

ఆ కాటేజీలో వారం రోజులు గడిపారు. షేఖ్‌కు ఉర్దూరాదు. ఇంగ్లీషు కొద్ది కొద్దిగావచ్చు. అమీనాకు కొంచెం కొంచెం అరబీ వచ్చు. వచ్చీరాని ఇంగ్లీషు, అరబీ భాషల్లోనూ, సౌజ్ఞలతోనూ వెళ్ళబుచ్చారు. షేఖ్

అమీనాకు అరబీ నేర్పటమూ, అమీనా షేఖ్‌కు ఇంగ్లీషు నేర్పటమూ మొదలు పెట్టారు.

ఆ వారం రోజుల్లోనే షేఖ్, అమీనాకు పాస్‌పోర్టు, వీసా రెండూ సంపాదించకలిగాడు. ఆ తరువాత స్వదేశానికి ప్రయాణం కట్టారు. వెళ్ళే ముందు అమీనా ఒకరోజు తల్లి ఇంట్లో గడిపింది. రెండవ రోజు తల్లినీ, తమ్ముళ్ళనీ వదల్లేక వదల్లేక వెళ్ళిపోయింది.

నేరుగా వెళ్ళి బొంబాయిలో తాజ్‌హోటల్లో దిగారు. ఆ హోటల్ పేరు విన్నదేగాని అది అలా స్వర్గంలా ఉంటుందని వూహించలేదు అమీనా.

రెండు రోజుల తరువాత విమానంలో దుబాయ్ చేరుకున్నారు. పట్టణంలో ఒక మారుమూలలో ఒక చిన్న బంగాళాలాంటి ఇంట్లో దిగారు. అప్పటికే అందులో అన్ని వసతులూ ఏర్పాటై ఉన్నాయి. ఒక ముసలి దాసీ మనిషి-లిబ్నా కూడా ఉంది. వంటతో సహా అన్ని పనులూ ఆ మనిషే చేసి పెడుతుంది.

దుబాయ్‌లో మొదటి రాత్రి జల్సాగా షేఖ్ విస్కీ-బాటిల్ తీసేసరికి అమీనా ఆశ్చర్యానికి అంతులేదు. ధైర్యంచేసి తన అనుమానం వ్యక్తం చేసింది. జవాబుగా షేఖ్ నవ్వుతూ, ఆమీనాను ఒళ్ళోకి తీసుకుంటూ "ఈ విషయాలు నువ్వు అడగనూ కూడదు, నేను చెప్పనూకూడదు" అంటూ తన పెదిమలతో మూసేశాడు.

రెండు రోజులు ఉండి వెళ్ళిపోయిన షేఖ్ తిరిగి పదిహేను రోజుల దాకా రాలేదు. ఈలోగా చాలా విషయాలు తెలుసుకుంది అమీనా.

హైదరాబాదుకూ, దుబాయ్‌కీ భూమ్యాకాశాల తేడా ఉంది. ముఖ్యంగా ఆడవాళ్ళ విషయంలో హైదదాబాదులో కూడా మధ్య తరగతి, కింది తరగతి

ముస్లిం స్త్రీలు పరదా పాటిస్తారు. కాని, బురఖా వేసుకుని స్వేచ్ఛగా తిరుగుతారు. మధ్య వయసు వాళ్ళు మొహంమీద బురఖా గుడ్డ తొలగించే తిరుగుతుంటారు. పైతరగతి వాళ్ళు అసలు పరదా పాటించనే పాటించరు. అమీనాకూడా బురఖా వేసుకొని అన్నిచోట్లకు వెళ్ళేది. ఏ ఆటంకమూ ఉండేదికాదు. కాని ఇక్కడ, దుబాయ్‌లో అలాకాదు. అన్ని తరగతుల స్త్రీలూ, అన్ని వయస్సుల స్త్రీలూ పరదాలో ఉండవలిసిందే. పన్నెండేళ్ళకు మించిన స్త్రీలు బయట కనిపించడమే అరుదు. కనిపించినా కాలి గోరుకూడా కనిపించనంత బురఖా వేసుకుంటారు. వాళ్ళ చదువంతా ఇంటి మట్టుకే పరిమితమై ఉంటుంది కాబట్టి ఆఫీసుల్లోగానీ, స్కూళ్ళల్లోగానీ, షాపుల్లో గాని పనిచేసే ఆడవాళ్ళు కనిపించరు. ఇదంతా లిబ్నా ద్వారా విన్నాక ఇంటి బయటికి అడుగు వెయ్యలేక పోయింది అమీనా.

వారం తిరగకుండానే బేజారెత్తి పోయింది అమీనాకు. ఇంటి పనులన్నీ లిబ్నా చేసి పెడ్తుంది. బజారుకి వెళ్ళటానికి ఒకచిన్న కుర్రాడు ప్రొద్దుటా, సాయంత్రమూ వచ్చి పోయేవాడు. అమీనాకు పనీ పాట లేక విసుగెత్తి పోయింది. తానొక ఖైదీగానూ, లిబ్నా ఆ కుర్రాడూ కాపలాదార్లుగానూ అనిపించి ఉక్కిరి బిక్కిరయింది.

కుర్రాడిచేత ఏరోగ్రాం ఒకటి తెప్పించి, తల్లికి ఉత్తరం వ్రాసింది. వారం రోజుల్లో జవాబు వచ్చింది. అందరూ కులాసాగా ఉన్నారట. తాను వచ్చేసిన నాలుగు రోజులకే రెండు వేల రూపాయలు అందాయట. అల్లుడుగారినీ, దుల్హాభాయి (బావగారి) నీ తెగపొగుడుతూ వ్రాశారు తల్లీ, తమ్ముళ్ళూ. తన గురించి వాళ్ళు అట్టే పట్టించుకున్నట్టే అనిపించలేదు. తన మీద తనకే జాలివేసి చిన్నగా నవ్వుకుంది.

మరో ముఖ్య విషయం కూడా లిబ్నా ద్వారానే తెలిసి అమీనా బిత్తరపోయింది. తాను షేఖ్ అబూ తాలిబ్‌కు రెండవ భార్య కాదు, మూడవ భార్యకూడా కాదు, నాలుగవ భార్య. అరబ్బీ స్త్రీ అబూధాబీలో స్వంత

ఇంట్లోనే ఉంటుందట. ఆమెకు అయిదుగురు సంతానం. రెండవ భార్య హిందూస్తానీ - కేరళ అమ్మాయి. నాలుగేళ్ళ క్రితం తెచ్చాట్ట. మూడవ భార్య పాకిస్తానీ అమ్మాయి. రెండేళ్ళక్రితం తెచ్చాట్ట వాళ్ళు ఇద్దరూ అబూధాబీలో ఉండరు. మరెక్కడో వేరు వేరు ప్రదేశాల్లో ఉంటారు. ఎక్కడ ఉండేదీ, సంతానం ఉందో లేదో లిబ్నాకు తెలియదు. వాళ్ళు ఇద్దరు కూడా కొత్తగా వచ్చినప్పుడు కొన్నాళ్ళపాటు ఈ ఇంట్లోనే ఉన్నారట. ఆ తరువాత మరెక్కడికో మార్చాట్ట. వాళ్ళిద్దరి కంటే అమీనాయే అందంగా ఉంటుందట. తనకు సంతానం కలిగితే షేఖ్ ఎంతో సంతోషిస్తాట్ట.

ఇదంతా వినగానే హడలెత్తి పోయింది అమీనా. ఏనాటికైనా తనకు బంధ విముక్తి కలుగుతుందా? ఒక్కటి మాత్రం నిశ్చయించుకుంది. తనకు సంతానం కలగకూడదు. ఈ ఖైదు నుంచి బయట పడాలంటే తనకు సంతానం ఉండకూడదు. అందుకు హైదరాబాదు నించి వచ్చేప్పుడే కావలి సినన్ని పిల్స్ తెచ్చుకుంది. షేఖ్ తన దగ్గరికి వచ్చినప్పుడల్లా అతనికి తెలియకుండానే వాడుతూనే ఉంది.

కాని, నిజంగా ధైర్యం చేసి బయటపడితే తల్లీ, తమ్ముళ్ళ గతేమి కాను? తన జీవితం ఎలాగూ పాడై పోయింది, వాళ్ళ సుఖ సంతోషాలను, భవిష్యత్తును కూడా కూలద్రోయడం భావ్యమేనా? పంజరంలో చిక్కిన పక్షిలా రెక్కలు రెపరెపా కొట్టుకుని పడి ఉండి పోయింది.

షేఖ్ పదిహేను రోజులకూ, ఇరవై రోజులకూ ఒకమాటు వచ్చే వాడు. రెండు మూడు రోజులు తనతో కులాసాగా గడిపి వెళ్ళిపోయేవాడు. తక్కిన భార్యల దగ్గిరకూడా అంతేనేమో. అమీనా అనుమాన మేమిటంటే, అప్పుడప్పుడు విదేశాలకు కూడా వెళ్ళి జల్సాగా తిరిగి వస్తాడేమో? .. అలా ఆరు నెలలు గడిచింది.

ఈ లోగా అమ్మ దగ్గిరనుంచి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి.నెలవారి డబ్బు సక్రమంగా అందుతూనే ఉందట. అందులో అయిదు వందలు

మామయ్య కాజేస్తాట్ట. అయినా ఫరవాలేదు. అమ్మ మిగిలిన పదిహేను వందల్లోంచి నెలకు వెయ్యిదాకా ఆదా చేస్తుందట. తమ్ముళ్ళు బాగా చదువు తున్నారట. పెద్దవాడు తప్పకుండా డాక్టర్నవుతానంటున్నాట్ట. అది చదవ గానే అమీనా హృదయం ఉప్పొంగి పోతుంది. వాడు ఎప్పుడు డాక్టరవు తాడా, తనను ఖైదు నుంచి ఎప్పుడు విముక్తురాల్ని చేస్తాడా అని కలలు కంటూంటుంది.

ఇంటి ఖర్చుకు షేక్ ఇచ్చివెళ్ళే డబ్బులోంచి కొంత వరకు అమీనా కూడా ఆదా చేస్తూంది. అందులోంచే కొంతభాగం లిబ్బాకు లంచంగా ముట్ట చెబుతూ, దాన్ని మంచి చేసుకుంది. హైదరాబాదులో తానెలా స్వేచ్ఛా జీవితం గడిపేదో చెప్పి చెప్పి, ఇక్కడ కూడా తనను అప్పుడప్పుడు బజార్కు వెళ్ళనివ్వమని ప్రాధేయ పడ్డది. లిబ్బా మొదట్లో ఒప్పుకోలేదు. షేక్కు తెలిస్తే తనను చంపేస్తాడన్నది. లంచం డబ్బు ఇంకా పెంచేసరికి మెత్త బడ్డది. మొదట్లో తాను వెంట బెట్టుకు వెళ్ళేది. తర్వాత పుత్రాణ్ణి పంపించేది. ఆ తర్వాత అమీనా ఒకర్తే కూడా వెళ్ళి రావడం మొదలెట్టింది

ఆ రోజు కూడా అలా ఒంటరిగా బజారుకెళ్ళి ఒక భారత దేశస్థుడి పుస్తకాల షాపులో ఉర్దూ పత్రికలు కొంటూంటే, అకస్మాత్తుగా హసన్ కంటబడ్డాడు. తన కళ్ళను తానే నమ్మలేక, అప్రయత్నంగా "హసన్"! అని పెద్దగా అనేసింది.

హసన్ ఆశ్చర్యంగా తల ఎత్తి చూశాడు. అమీనా కాస్త దగ్గరగా వెళ్ళి, "నేను, హసన్, అమీనాను" అంది.

హసన్ సంభ్రమాశ్చర్యాలతో, "అమీనా! నువ్వు... నువ్వు ఇక్కడా"? అన్నాడు.

"అవును, నేనే. అదో పెద్ద గాథలే. చెబుతా, పదా" అంటూ వీధిలోకి దారితీసింది.

హసన్ అనుసరించాడు.

కొట్టువాడు ఇద్దర్నీ వింతగా చూస్తూండి పోయాడు.

ఇద్దరూ వీధి వెంట మెల్లి మెల్లిగా నడుస్తూ వెళుతూన్నారు. అమీనా తనకథ అంతా ఏకరువు పెట్టింది.

"రా, హసన్! ఈ ప్రక్క వీధిలోనే మా ఇల్లు."

హసన్ చప్పున ఆగి పోయాడు. "మీ ఇంటికా? షేఖ్?"

"లేడులే. మొన్ననే వెళ్ళాడు మళ్ళీ పది పన్నెండు రోజులకుగానీ రాడు."

"అయినా?"

"ఫరవాలేదు. రా, హసన్; నీతో చాలా విషయాలు మాట్లాడేదుంది" అంటూ దారితీసింది.

హసన్ వెంబడించాడు.

తలుపు తట్టగానే, లిబ్నా తలుపు తీసి, హసన్‌ను చూసి షాక్ తిన్నట్టుగా అడుగు వెనక్కువేసి, ఇద్దర్నీ మార్చి మార్చి అనుమానంగా చూసింది.

"లిబ్నా! ఇతను హసన్‌భాయి. హైదరాబాదులో మా వీధిలోనే ఉంటాడు. మాకు దగ్గరి బంధువు. నాకు అన్న వరుస. ఇక్కడే ఉన్నాట్ట. నాకు తెలియనే తెలియదు. ఇందాకా వీధిలో కనిపిస్తే పిలుచుకొచ్చాను... రా, హసన్! లోపలికి రా. ఆఁ, లిబ్నా! త్వరగా టీ చేసి రెండు కప్పులు తీసుకురా" అని హసన్‌ను తీసుకువెళ్ళి సోఫాలో కూర్చోబెట్టింది. తాను బుర్‌ఖా తీసేసి ఎదురుగా కూర్చుంది.

ఇద్దరూ ఒకరి నొకరు తదేకంగా చూసుకుంటూ కూర్చుండిపోయారు. ఇద్దరి కళ్ళూ చెమ్మగిల్లాయి. లిబ్నా టీ తెచ్చేదాకా తేరుకోలేదు.

అమీనా టీ కలిపి ఒక కప్పు హసన్‌కు అందిస్తూ మెల్లిగా అంది: "లిబ్బాకు ఉర్దూ బొత్తిగా రాదు. మనం స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు." కాసేపాగి మళ్ళీ అంది: "హసన్! నువ్వు నన్నలా అన్యాయం చేసి పారి పోయి ఉండకపోతే నాకీ గతి పట్టేది కాదు, చెప్పు హసన్! ఎందుకలా, చేశావు?"

"ఏం చెప్పను, అమీనా! నాకక్కడ నిలువ నీడ లేకుండా పోయింది. నా ఎమ్. ఏ. ఫిలాసఫీ ఎందుకూ పనికిరాకుండా పోయింది. చిన్న ఉద్యోగం కూడా దొరకలేదు. మా అన్న, వదినలకు నేను భారమై పోయాను. ఎలాగైనా నన్ను, వదిలించుకోవాలని చూశారు మా వదినలు. నీ ముందర కూడా మొహం చెల్లక, నీకూ చెప్పకుండా, ఇక్కడ ఒక స్నేహితుడు రమ్మంటే వచ్చేశాను. నా డిగ్రీ ఇక్కడా పనికిరాలేదు. మా స్నేహితుడి వర్క్‌షాపులోనే మెకానిక్‌గా పని నేర్చుకుంటూవచ్చాను. కొన్ని పరీక్షలు కూడా పాసు అయాను. ప్రస్తుతం వెయ్యి దిరంలదాకా సంపాదించు కోగలు గుతున్నాను. ఇవ్వాళ్ళ ఒక చోటికి ఇంటర్వ్యూకు వెళ్ళి వస్తున్నాను. ఆ పని దొరికితే నెలకు పదిహేను వందల జీతమవుతుంది. అమీనా! నామాట నమ్మ! నేను నిన్ను ఎన్నడూ మరువలేదు. ఇప్పుడిప్పుడే నా కాళ్ళమీద నిలబడ గలుగుతున్నాను. ఇక నీకు ఉత్తరం రాద్దామనే అనుకుంటున్నాను. ఇంతలో నువ్వే..."

"హుఁ!" పెద్దగా నిట్టూర్చింది అమీనా. "చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం, హసన్?"

హసన్ తల దించేసుకున్నాడు. చాలాసేపు మౌనంగా కూర్చుని, "వస్తాను, అమీనా!" అంటూ లేచాడు.

"మళ్ళీ ఎప్పుడు?"

"మళ్ళీనా?!"

"నిన్ను చూడగానే జీవచ్ఛవంలా పడి ఉన్ననాకు ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది, హసన్! అప్పుడప్పుడు నీ మొహమైనా చూడకపోతే, బ్రతకనేమో ననిపిస్తోంది." అమీనా కంఠం రుద్ధమైపోయింది.

హసన్ కాస్సేపు మౌనంగా నిలుచుని, మౌనంగానే వెళ్ళిపోయాడు. అమీనా అటువేపే చూస్తూ ఉండిపోయింది...

ఆ రాత్రే, అర్ధరాత్రి, అకస్మాత్తుగా మెలుకువ వచ్చి మళ్ళీ నిద్ర పట్టలేదు అమీనాకు. పాత స్మృతులూ, హసన్‌తో మళ్ళీ కలయికా నెమరు వేసుకుంటూ రాత్రంతా గడిపివేసింది. తెల్లవారుజామున ఎప్పుడో కునుకు పట్టింది.

బద్ధకంగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని, నాష్తా చేసి మళ్ళీ పక్క మీద ఒరిగిపోయింది. ఎడతెరిపిలేని ఆలోచనలు, దారీ తెన్నూ చూపని ఆలోచనలు ముసురుకొచ్చాయి. మళ్ళీ ఎప్పుడు నిద్ర పట్టిందో, ఎంతవరకు నిద్రపోయిందో తెలియనే తెలియదు. లిజ్జా తట్టి లేపేదాకా మెలకువ రాలేగ. సాయంత్రపు చాయలు కనిపిస్తూన్నాయి.

"నిన్నటి స్నేహితుడు హసన్ వచ్చాడు" అంది లిజ్జా ముక్త సరిగా.

అమీనా దిగ్గున లేచింది. గబగబా మొహానికి నీళ్ళు కొట్టుకుని, ముంగురులు సవరించుకుని, బయటి గదిలోకి వెళ్ళింది. ఎదురుగా హసన్ కూర్చుని ఉన్నాడు.

"హసన్ ! నువ్వా? ఇంత త్వరగా నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు హసన్ !"

"నీతో ఒక ముఖ్య విషయం చెబుదామని వచ్చాను, అమీనా! కూర్చో."

"ముఖ్య విషయమా?" కూర్చుంటూ అన్నది. — "ఏమిటది?"

"నిన్న ఇంటర్వ్యూ అయిందని చెప్పాను కదూ? నాకా ఉద్యోగం వచ్చేసింది."

"ఓ...అదా? ముబారక్! (అభినందనలు)" అన్నది అమీనా చప్పగా.

"ఏం, అమీనా, నీకు సంతోషంగా లేదా?"

"ఎందుకులేదూ? చాలా సంతోషంగా ఉంది. ఇక పెళ్ళి చేసుకుని నువ్వు ఒక ఇంటి వాడివికా."

"అదే, అమీనా, అదే నీతో చెప్పబోయే ముఖ్యవిషయం. నేను నిన్న రాత్రంతా ఆలోచించాను. ఒక నిర్ణయానికి వచ్చాను. నిన్ను ఈ ఖైదు నుంచి విముక్తురాల్ని చేస్తాను, నా దానిగా చేసుకుంటాను."

"హసన్!"

"అవును, అమీనా! తప్పకుండా చేసి తీరుతాను."

"కాని ..కాని, హసన్! నేనే పరిస్థితుల్లో ఇందులో ఇరుక్కున్నానో నీకంతా చెప్పాను."

"అంతా తెలుసు. నువ్వేమీ బెంగపెట్టుకోకు. నారు పదిహేనువందల దిరంలు దొరుకుతాయి. ఇక్కడి గురించి నువ్వు విన్నదంతా నిజంకాదు. ఇప్పుడిప్పుడు ఇక్కడ కూడా ఆడవాళ్ళకి ఉద్యోగాలు దొరుకుతున్నాయి— ముఖ్యంగా పై దేశస్థులకు. ఆడపిల్లల స్కూళ్ళలో దొరక్కపోదు. మనం ఇద్దరం కలిసి మీ కుటుంబాన్ని ఆదుకుందాం. నీ తమ్ముళ్ళకి పై చదువులు చదివిద్దాం.''

"నిజంగానా, హసన్? ?'' ఉత్సాహంగా అడిగింది అమీనా. కాని, వెంటనే, మరొకటి జ్ఞాపకం వచ్చి, దిగులుగా, "కాని.. కాని, హసన్! షేఖ్‌సాబ్?" అన్నది.

"ఆ విషయంలో భయపడకు. ఆయన్ని నేను చూడలేదు, కాని, మంచివాడే అయివుంటాడు. మన సంగతంతా విన్నవించుకుంటే, మనల్ని మన్నించి, నీకు విడాకులు ఇచ్చేస్తాడని నాకు నమ్మకంగా ఉంది. ఆయన ధనవంతుడు, తలచు కుంటే భార్యలకు కొదువ ఉండదు."

"నిజం! నీ అంచనా అక్షరాలా నిజం, హసన్!" అంటూ, నవ్వుతూ లోపలినుంచి వచ్చాడు షేఖ్.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు, అమీనా గజగజ వణికిపోయింది. "మీరు...మీరు?!"

"నేను ఎప్పుడో వచ్చేశాను. నువ్వు నిద్ర పోతున్నావు. హసన్ గురించి లిబ్నా నాకంతా చెప్పేసింది."

"లిబ్నా? !"

"ఆ, లిబ్నాయే చెప్పింది. లిబ్నా కెలా తెలిసిందా అని ఆశ్చర్య పోతున్నావా? ఇందాకటి లాగే నిన్న కూడా మీరు బాహాటంగానే మాట్లాడు కున్నారటగా? ఉర్దూ నాకూ వచ్చు. లిబ్నాకూ వచ్చు. హైదరాబాదు భార్య దగ్గిర ఉర్దూ తెలియని దాసీని నియమిస్తానా?" అంటూ మళ్ళీ నవ్వాడు.

ఇద్దరికీ నోట మాట రాలేదు.

"కాని, మీ రెందు కలా భయపడుతున్నారు? హసన్ అంచనా అక్షరాలా నిజమని చెప్పగా? నేను స్వతహాగా మంచి వాడినే. ఇద్దరు ప్రేమి కుల మధ్య అడ్డు గోడగా నిలవను. నీకు తప్పకుండా విడాకు లిచ్చేస్తాను. అంతేకాదు. మీ ఇద్దరి నికాహ్ కూడా నా చేతుల మీదుగానే జరిపిస్తాను. ఆఁ, హసన్! శుభస్య శీఘ్రం. రేపు శుక్రవారం మంచి రోజు. అన్నీ రేపే జరిగి పోవాలి. ఎల్లుండి నేను వెళ్ళిపోతున్నాను. రేపు సాయంత్రం సూర్యాస్త మయ సమయానికి ఇక్కడికే వచ్చేయి. ఖాజీసీ, మరో గవాహ్‌ను సిద్ధంగా ఉంచుతాను. వాళ్ళ సమక్షంలోనే విడాకుల్నూ నికాహ్ రెండూ జరుగుతాయి. ఊఁ, వెళ్ళు."

హసన్ అమీనా వేపు చూశాడు. అమీనా తల వంచేసుకుంది.

"ఏం నా మాట మీద నమ్మకం కలగటం లేదా? రేపు చూస్తురు గాని నా మంచితనం."

"అదికాదు, షేఖ్!" హసన్ నోట మాట పెకిలింది.

"ఏది కాదు?"

"ఒకే రోజు రెండూ ఎలా జరుగుతాయి? ముందు విడాకులు కానివ్వండి."

"ఆ తర్వాత నువ్వు అమీనాను పెళ్ళి చేసుకోకుండా ఎగ్గొట్టేస్తే? ఇలాంటి వెర్రి వేషాలు నా దగ్గర పనికిరావు, తెలుసా?" కొంచెం కోపంగా అన్నాడు షేఖ్.

"మీరు పొరబడుతున్నారు. నేను అమీనాను మనసారా ప్రేమించాను, తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను. కాని, మన మతం ప్రకారం విడాకుల తర్వాత ఇద్దత్ (నాలుగు మాసాల గడువు) గడవాలిగా?"

"ఓ అదా?!" పెద్దగా నవ్వాడు షేక్. "అదెందుకో తెలుసా? భార్య గర్భిణిగా ఉందో, లేదో చూడటానికి. అమీనా విషయంలో ఆ భయం లేదు. ఆమె అన్ని జాగ్రత్తలూ చేసుకున్నది."

"యా అల్లా!!" అమీనా నోట అప్రయత్నంగా వెలువడ్డది,

చిరునవ్వుతో సాగించాడు షేఖ్. "నా కంతా తెలుసు, అమీనా! నిన్ను మొదటినుంచీ గమనిస్తూనే ఉన్నాను.. ఆ విషయం నాకు వదిలేయండి. అమీనా గర్భిణి కాదని ఖాజీని నేనునమ్మిస్తాను. సశాస్త్రీయంగానే మీ నికాహ్ జరిపిస్తాడు. ఊఁ, హసన్! నువ్వింక నిశ్చింతగా వెళ్ళు, రేపు తప్పకుండా రావాలి సుమా? రాకపోతే ఈ షేక్ ఆగ్రహానికి గురి అవుతావు జాగ్రత్త!"

హసన్ తల వంచుకుని వెళ్ళిపోయాడు.

అమీనా షేక్ మొహంలోకి చూస్తూ ఉండి పోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఇది... ఇది కలా, నిజమా?"

"కలలాంటి నిజం. లిబ్నా! సీసా తీసుకురా. తినుబండారాలు కూడా" అంటూ కూర్చున్నాడు షేఖ్.

అమీనా అలానే నిలుచుంది. లిబ్నా తెచ్చిపెట్టింది. షేఖ్ గ్లాసులోకి వంపుకుని ఒకపెద్ద పెగ్ గటగటా తాగేశాడు.

"అలా నిలుచున్నావేం? ఇలారా—నా దగ్గరికిరా. ఒక్క విషయం మరిచిపోకు. నేను నీకు విడాకులిచ్చేది రేపు. ఇవ్వాళ నువ్వు నా భార్యవే. ఇది మన ఆఖరి రాత్రి. మొదటి రాత్రిలా మజాగా గడపాలి. రా" అంటూ, చెయ్యి పట్టుకుని ఒళ్ళోకి లాక్కున్నాడు.

రెండవ రోజు అమీనా లేచేసరికి షేఖ్ లేడు. ఎటు వెళ్ళాడో లిబ్నాకు తెలియదన్నది. కాని, సాయంత్రం ఆరింటికల్లా వచ్చేశాడు. వెంట ఒక ఖాజీ లాంటి వ్యక్తి, డ్రైవర్ సులేమాన్ వచ్చారు. అమీనా లోపలికి వెళ్ళి పోయింది.

"హసన్ ఇంకా రాలేదా?" అంటూ లోపలికి వచ్చాడు షేఖ్. అమీనా జవాబు చెప్పలేదు.

"అరె! నువ్వింకా తయారు కాలేదా, అమీనా? ఊఁ, వెంటనే అయి పోవాలి, పెళ్ళినాటి అలంకరణంతా చేసుకోవాలి. బురఖా కప్పుకుని సిద్ధంగా ఉండు. నేను పిలువగానే బయటికి రా" అంటూ వెళ్ళి సీసా గ్లాసూ పెట్టుకు కూర్చున్నాడు. ఖాజీ కొంతదూరంలో గడ్డం నిమురుకుంటూ కూర్చున్నాడు. సులేమాన్ చేతులు కట్టుకుని దూరంగా నిలుచున్నాడు.

ఇంతలో హసన్ రానే వచ్చాను. హైదరాబాదు డ్రెస్సు, చుడీదార్ పైజామా, శేర్వానీ వేసుకు వచ్చాడు. షేఖ్ సంతృప్తిగా నవ్వాడు.

"వచ్చావా, హసన్? నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఆ ఖాజీ సాబ్! నమాజుకు సమయమైందను కుంటాను. మీరు ముగ్గురు కానివ్వండి నాకు ఓపిక లేదు" అంటూ మరో గ్లాసు వంపుకున్నాడు షేఖ్.

ఖాజీ, హసన్, సులేమాన్ మక్కా వేపు తిరిగి నమాజు చదివారు.

"ఆ, అయిందా? ఇక అసలు తతంగం కానివ్వండి. మొదట విడాకులు. అమీనా! అమీనా!"

అమీనా రాలేదు.

"లిబ్నా! అమీనాను పిలుచుకురా — పొద్దు పోతోంది."

కొంచెం సేపటికి లిబ్నా సహాయంతో అమీనా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. నిండా బురఖా ఉంది.

"ఊఁ, అలా కూర్చో." కూర్చుంది.

"ఇక వినండి, ఖాజీసాబ్, హసన్, సులేమాన్! నే నిప్పుడు మీ ముగ్గురి సమక్షంలో నా భార్య అయిన అమీనా బేగంకు విడాకులు ఇచ్చేస్తున్నాను. ఇచ్చాను, ఇచ్చాను, ఇచ్చాను" అని మూడు సార్లు అన్నాడు. "అంతే కదూ? ఖాజీసాబ్?"

అవునన్నట్టు తల ఊపాడు ఖాజీ.

"అమీనా బేగం! నువ్వీక నా భార్యవు కావు. స్వతంత్రురాలివి. స్వేచ్ఛగా మరొకర్ని నికాహ్ అడవచ్చు. ఇద్దత్ అవసరం లేదని ఖాజీ సాబ్‌ను నమ్మించాను. కాబట్టి ఇప్పుడే నికాహ్ జరగొచ్చు. మన పెళ్ళి ఒడంబడిక ప్రకారం మెహర్‌గా నే నివ్వవలసిన ఇరవై అయిదు వేల దిరంలు నీ పేరిట బాంకులో సురక్షితంగా ఉన్నాయి. నీ ఇష్ట ప్రకారం వాడుకోవచ్చు."

హసన్ ఆశ్చర్యంగా, కృతజ్ఞతగా షేఖ్ కేసి చూస్తున్నాడు.

"అవును, హసన్! మీ పెళ్ళయ్యాక, మీ కొత్త సంసారానికి ఆ డబ్బు ఎంతైనా అవసరం ఉంటుంది. ఆఁ, ఖాజీసాబ్! ఇక నికాహ్ జరిపించండి. సులేమానా! కార్లో సెహరా ( పూల బాసికం ) తెచ్చాంగా? తెచ్చి పెళ్ళి కొడుక్కి కట్టు".

సులేమాన్ పరుగెత్తుకు వెళ్ళి పువ్వుల సెహరా తెచ్చి హసన్ నొసట కట్టాడు. పెళ్ళి ఒడంబడిక పత్రం తయారు చేశారు.

"మెహర్ ఎంత వ్రాయమంటారు?" ఖాజీ అడిగాడు.

షేఖ్ హసన్ కేసి చూశాడు.

హసన్ తడబడుతూ— "పేదవాణ్ణి, నే నెంత వ్రాయగలను. అయిదు వందలు వ్రాయండి" అన్నాడు.

అలాగే వ్రాశారు, ఇద్దరి సమ్మతం తీసుకున్న తరువాత షేఖ్ సులేమాన్ సాక్షులుగా సంతకాలు చేశారు.

"ముబారక్! ముబారక్!" అంటూ లేచి, షేఖ్ తడబడుతూ వెళ్ళి హసన్‌ను ఆలింగనం చేసుకున్నాడు. ఖాజీ సులేమాన్‌కూడా అలాగే చేశారు.

"సులేమాన్! కారులో మనం తెచ్చిన మిఠాయి కూడా ఉండాలిగా? తే" అన్నాడు షేఖ్. సులేమాన్ తెచ్చాడు.

షేఖ్ తానే తీసుకు వెళ్ళి, దంపతు లిద్దరికీ ఒకరి చేత ఒకరికి మిఠాయి తినిపించాడు. హసన్ షేఖ్‌కు కూడా మిఠాయి ఇవ్వబోయాడు. షేక్ వెనక్కి తగ్గాడు.

"అదిగో, నా మిఠాయి అది" అంటూ సీసా దగ్గరికి వెళ్ళి కూలబడ్డాడు.

"సులేమాన్! ఇదిగో, ఈ మిఠాయి తీసుకువెళ్ళి మీ ఇద్దరూ తినండి, బయట పంచి పెట్టండి. ఖాజీసాబ్‌ను దిగబెట్టిరా" అన్నాడు.

ఇద్దరూ వెళ్ళిపోయారు.

"ఊఁ, మీ రిద్దరూ దంపతులు నా ముందర కూర్చోండి. నా కివాళ ఎంత సంతోషంగా ఉందో మీరు వూహించలేరు" అంటూ సీసాలోదంతా గ్లాసులోకి వంపుకున్నాడు.

హసన్ చేతులు జోడించి కృతజ్ఞతా పూర్వకంగా— "షేఖ్‌సాబ్! మీరు నిజంగా ఎంత మంచివారండీ!" అన్నాడు.

"హ హ్హ హ్హ హ హ్హ!" పెద్దగా నవ్వాడు షేఖ్ "నా మంచితనం ఇంకా ఏం చూశావు? కొంచెం ఆగు."

ఇంతలో అమీనా "అబ్బా!" అని కడుపు పట్టుకుని బాధతో గింజుకుంటూ పడిపోయింది. హసన్ ఆమె వేపుకు పోబోయి తూలి పడిపోయాడు! అతని కళ్ళలో భయం ఆవరించింది. షేఖ్ వేపు నిప్పులు గక్కుతూ చూస్తూ "షేఖ్, షేఖ్ నువ్వు—నువ్వు మాకు విషం తినిపించావు" అంటూ లేచి షేఖ్ మైన పడబోయాడు. షేఖ్ నవ్వుకుంటూనే కాలితో ఒక్క తోపు తోశాడు. హసన్ దూరంగా వెళ్ళి పడిపోయాడు. అమీనా తేరుకుని "ఇది. . ఇది అన్యాయం...అన్యాయం" అన్నది.

షేఖ్ అట్టహాసంగా నవ్వాడు. "ఏది అన్యాయం? మీ అమ్మకు అయిదువేల రూపాయలివ్వటం అన్యాయమా? నెల నెలా రెండు వేలు పంపించటం అన్యాయమా? నీ కిక్కడ గర్జా జీవితం చేకూర్చటం అన్యాయమా? ఇక్కడ నా పరువు ప్రతిష్ఠలు, పద్ధతులు, నియమాలు తెలిసికూడా నా వెనకాల ఒంటరిగా బజారులో తిరగటం అన్యాయమా? నీ ప్రియుడితో బాహాటంగా చెట్టా పట్టాల పట్టుకు తిరగటం అన్యాయమా? ప్రియుణ్ణి ఇంటికే పిలుచుకువచ్చి కులకటం అన్యాయమా? ఏది అన్యాయం?... వినగలుగు

తున్నావా, అమీనా? ఈ ఒక్క మాట కూడా విని సుఖంగా చచ్చిపో. నీ చావు సంగతి మీ వాళ్ళకి ఇప్పుడప్పుడే తెలియ నివ్వను. నీ కోరిక ప్రకారం నీ తమ్ముడు డాక్టర్ అయ్యేదాకా నెలకు రెండు వేలు పంపిస్తూనేఉంటాను. ఏం, విన్నావా?"

ఆ మాట అమీనా విన్నదో, లేదో కాని ఇద్దరిలోనూ చలనం ఆగి పోయింది.

షేక్ చప్పట్లు కొట్టాడు. సులేమాన్, ఖాజీ ఇద్దరూ లోపలికి వచ్చారు. ఖాజీ కిప్పుడు గడ్డం, మీసాలు లేవు. రాగానే ఇద్దరి నాడీ పరీక్షించాడు. అంతా అయిపోయినట్టు షేక్‌కు సౌంజ్ఞ చేశాడు.

"లిజ్నా! ఆమీనా పైని నగలన్నీ వలిచి ఇలాతే."

"ఊఁ, ఇక ఇద్దర్నీ తీసుకు వెళ్ళి కారు డిక్కీలో, పడేసి నేను చెప్పినట్టు చేసి రండి" అన్నాడు.

ఇద్దరూ రెండు శవాల్ని మోసుకెళ్ళారు.

షేక్ గ్లాసులో దంతా ఒక్క గుక్కలో తాగేసి ఒరిగి పోయాడు.

(ఆంధ్రప్రభ వార పత్రిక : 6-8-80)

